సాక్షి ఏలూరు

ఆదివారం | 6 | జూలై | 2025



భక్తుల రద్దీ సాధారణం

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. స్వామివారికి ప్రీతికరమైన రోజు అయినప్పటికీ ఆషాఢ మాసం కావడంతో రద్దీ తగ్గింది.



జంతువుల వ్యాధులతో జాగ్రత్త!

జంతువుల నుంచి సక్రమించే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యులు సూచిస్తున్నారు. నేడు జూనోసిస్ డే సందర్భంగా కుక్కలకు టీకాలు వేయనున్నారు. 8లో ▸



గురుకుల విద్య.. భద్రత మిథ్య

శిథిలావస్థకు చేరిన భవనాల్లోనే గురుకుల విద్య తరగతులు నిర్వహిస్తుండడంతో ఏ క్షణాన ఏ భవనం కూలిపోతుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. 8లో ▸

న్యూస్‌రీల్

రాజీ మార్గమే ఉత్తమం



లోక్ అదాలత్ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి

ఏలూరు (టూటౌన్)/ఏలూరు(ఆర్ఆర్‌పేట): రాజీ మార్గమే ఉత్తమమని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి అన్నారు. శనివారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. లోక్ అదాలత్ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి మాట్లాడుతూ కక్షిదారులకు త్వరితగతిన కేసుల పరిష్కారం నిమిత్తం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నామని చెప్పారు. కక్షిదారులు సౌలభ్యం కోసం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా 35 బెంచీలు ఏర్పాటు చేసి త్వరితగతిన కేసుల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తున్నామని తెలిపారు. రెండో అదనపు జిల్లా జడ్జి యు.ఇందిరా ప్రియదర్శిని, ఐదో అదనపు జిల్లా జడ్జి ఆర్‌వీవీఎస్ మురళీకృష్ణ, ఏడో అదనపు జిల్లా జడ్జి వై.శ్రీనివాసరావు, ఎనిమిదో అదనపు జిల్లా జడ్జి ఐ.శ్రీనివాస మూర్తి, పోక్సో జడ్జి కుమారి శ్రీవాణి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 6324 పెండింగ్ కేసులను, 141 ప్రీ లిటిగేషన్ కేసులను రాజీచేసినట్టు జిల్లా జడ్జి ఎస్.శ్రీదేవి తెలిపారు. రాజీ కేసుల్లో మోటార్ వాహన ప్రమాద కేసులు 129, సివిల్ కేసులు 219, క్రిమినల్ కేసులు 5,976 ఉన్నాయన్నారు.

వైఎస్సార్‌టీయూసీ కార్యదర్శిగా పల్లె రవీంద్రరెడ్డి



నూజివీడు: రాష్ట్ర వైఎస్సార్‌టీయూసీ సెక్రటరీగా నూజివీడుకు చెందిన పల్లె రవీంద్రరెడ్డిని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ప్రకటన విడుదల చేసింది. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రవీంద్రరెడ్డిని నియమించినట్లు ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో రవీంద్ర రెడ్డి మార్కెట్ యార్డు చైర్మన్‌గా, రైతు సలహా సంఘం జిల్లా సభ్యుడిగా, వైఎస్సార్‌టీయూసీ జిల్లా సెక్రటరీగా పనిచేశారు.

నిండుకుండలా గోదావరి



గోదావరి నుంచి సామాన్లను పడవలో ఒడ్డుకు తరలిస్తున్న జాలర్లు

కుక్కునూరు: ఎగువ రాష్ట్రాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా గోదావరికి వరద నీరు చేరింది. శనివారం భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం 20 అడుగులకు చేరుకుంది. కుక్కునూరు వద్ద నిండుకుండను తలపిస్తోంది. వరద ప్రవాహం పెరగడంతో శనివారం ఉదయం వరకు గోదావరి ఇసుక తెన్నెల మీద ఉన్న జాలర్లు సామన్లు, వలలతో సహా ఒడ్డుకు చేరుకున్నారు. గోదావరి వరద ప్రవాహంగా స్వల్పంగా పెరిగిందని కుక్కునూరు తహసీల్దార్ కె.రమేష్‌బాబు అన్నారు .రానున్న రోజుల్లో ప్రవాహం మరింత పెరిగినా బాధిత గ్రామాల ప్రజలు ఇబ్బంది పడకుండా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. వరద ప్రభావిత గ్రామాల ప్రజలకు పునరావాస సహాయక కేంద్రాలను సిద్ధం చేశామన్నారు.

1.87 లక్షల క్యూసెక్కులు విడుదల

పోలవరం రూరల్: గోదావరి వరద పెరుగుతూ ఉభయగోదావరి జిల్లాల మధ్య లంక ఒడ్డులను తాకుతూ ప్రవహిస్తోంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద 27.920 మీటర్లకు నీటిమట్టం చేరుకుంది. స్పిల్‌వే నుంచి దిగువకు 1.87 లక్షల క్యూసెక్కులకు పైగా వరదనీరు చేరుతోంది.

పాఠశాల లాగిన్‌కు ఎస్ఎస్‌సీ జవాబు పత్రాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇటీవల నిర్వహించిన ఎస్ఎస్‌సీ ఎస్ఈ పరీక్షలకు సంబంధించి రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల జవాబుపత్రాలు సంబంధిత పాఠశాలల లాగిన్‌కు విడుదల చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకట లక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల జవాబు పత్రాలు వెంటనే సదరు విద్యార్థులకు ప్రింట్ తీసి అందచేయాలని ఆదేశించారు.

స్కాంలకు సహకారం

- రైతుకు తెలియకుండానే రైతుల పేరుతో రుణాలు
- పలు సహకార సొసైటీల్లో అవినీతి
- విచారణాధికారులే కింగ్ మేకర్లుగా మారుతున్న వైనం
- చింతలపూడి సొసైటీలో గతంలో రూ.30 కోట్ల మేర అవినీతి
- డిపాజిట్లు ఇవ్వాలంటూ టి.నర్సాపురం సొసైటీ వద్ద రైతుల ఆందోళన



టి.నర్సాపురం సహకార సంఘ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న రైతులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, ఏలూరు: రైతులకు తెలియకుండా రైతుల పేరుతో కోట్లలో రుణాలు తీసుకుంటారు. రైతుల నుంచి డిపాజిట్లు సేకరించి విచారణ పేరుతో కాలపరిమితి ముగిసినా తిరిగి చెల్లించరు. కార్యదర్శులు మినిట్ బుక్‌లో రాసిందే శాసనం. విచారణాధికారులే కింగ్ మేకర్లుగా మారి సమస్య సృష్టించి దానిని ఫిర్యాదుగా మలిచి దాని మీద విచారణ చేసి కావాల్సిన మేరకు దండుకుంటారు. ఇదీ జిల్లా సహకార శాఖ పరిధిలోని కొన్ని సొసైటీల్లో జరుగుతున్న అవినీతి. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జిల్లాలోని కొన్ని సొసైటీల్లో రూ.కోట్ల అవినీతి జరుగుతున్నా ఉన్నతాధికారులు సైతం దృష్టి సారించడం లేదు. దీనిని బట్టి అవినీతి ఏ స్థాయికి చేరిందో అర్థం చేసుకోవచ్చు. తాజాగా టి.నర్సాపురం సొసైటీలో రూ.15 కోట్లకుపైగా డిపాజిట్లను తిరిగి ఇవ్వాలని రైతులు ఆందోళన నిర్వహించి సొసైటీకి తాళం వేయించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 258 సహకార సంఘాలున్నాయి. వీటి పరిధిలో ఏటా సుమారు రూ.5 వేల కోట్ల మేర టర్నోవర్ జరుగుతుంది. ఐదారు గ్రామాలు కలిపి సొసైటీగా ఏర్పడి రైతులను సభ్యులుగా చేర్చుకుని సొసైటీ ద్వారా ఎరువులు, పురుగు మందులు విక్రయించడం, రైతుల నుంచి డిపాజిట్లు స్వీకరించడం, రైతులకు రుణాలు ఇస్తూ కార్యకలాపాలు నిర్వహిస్తుంటాయి. రూ.50 కోట్ల పైగా టర్నోవర్ జరిగే సొసైటీలు ఉమ్మడి జిల్లాలో అనేకం ఉన్నాయి. ఆదాయం పెరిగి వృద్ధిలోకి వస్తే సేవలు విస్తరించాలి. ఆదాయం పెరిగే ప్రతి సొసైటీలో అవినీతి పెరగడం స్థానిక ఉద్యోగులు మొదలుకొని జిల్లా స్థాయి అధికారుల వరకు పెంచి పోషిస్తూ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారు.

టి.నర్సాపురం సొసైటీకి తాళం

టి.నర్సాపురం సొసైటీలో గతంలో భారీ కుంభకోణం వెలుగుచూసింది. కొన్నేళ్లుగా త్రిసభ్య కమిటీతో సొసైటీ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. 370 మందికి సంబంధించి రూ.15 కోట్ల మేర మెచ్యూరిటీ పూర్తయినా డబ్బు ఖాతాల్లో జమ చేయలేదని ఆగ్రహించిన రైతులు డిపాజిట్లు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం సొసైటీ సిబ్బందితోనే తాళాలు వేయించి సొసైటీ వద్ద నిరసన వ్యక్తం చేశారు.

అవకతవకలు పరిశీలిస్తాం

> సహకార సొసైటీలో జరిగిన అవినీతి, విచారణలు పూర్తిగా మా దృష్టికి రాలేదు. కొత్తగా ఇన్‌చార్జి బాధ్యతలు స్వీకరించాను. అన్నింటిని పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదించి చర్యలు తీసుకుంటామం.
>
> – కే.వెంకటేశ్వరరావు, జిల్లా సహకార శాఖ ఇన్‌చార్జి

రూ.100 కోట్లకుపైగా అవకతవకలు

జిల్లాలో గంగన్నగూడెం, విజయరాయి, జోగన్నపాలెం, చింతలపూడి, రాఘవాపురం, పోతునూరు, టీ. నర్సాపురం ఇలా సుమారు 25కుపైగా సొసైటీల్లో అవకతవకలు జరిగాయి. కొద్దిమందిపై విచారణ, సస్పెన్షన్లతో కోట్లాది రూపాయల అవినీతిని మరుగున పడేస్తున్నారు. కొన్నిచోట్ల వ్యవహారం బయటకు వచ్చినా ఇబ్బంది లేకుండా రికార్డులను తమదైన శైలిలో మార్చి మొక్కుబడి ఎంక్వైరీ పేరుతో ఫైల్స్ మూసేస్తున్నారు. చింతలపూడి సొసైటీలో రూ.30 కోట్ల మేర అవినీతి జరిగింది. 8,928 మంది సభ్యులున్న సొసైటీలో ఏటా సగటున రూ.61.22 కోట్ల మేర టర్నోవర్ జరుగుతుంది. గతంలో ఈ సొసైటీలో రైతులకు తెలియకుండా రూ.కోట్ల రుణాలు సొసైటీ, శాఖలోని కీలక వ్యక్తులే తీసుకున్నారు. దీనిపై ఫిర్యాదులు రావడంతో విచారణ నిర్వహించారు. నిబంధనల ప్రకారం ఆరు నెలల్లోపు పూర్తి చేసి చర్యలు తీసుకోవాలి.

అక్రమాలకు సహకరిస్తున్న విచారణాధికారులు

విచారణాధికారి అన్ని విధాలా సహకారం అందించి ఆరు నెలల్లో జరగాల్సిన విచారణను నిలుపుదల చేస్తూ.. సొసైటీ సభ్యులు కోర్టుకు వెళ్లి స్టే తీసుకువచ్చేలా సాయపడుతున్నారు. సీజ్ చేసిన సొసైటీ రికార్డులు విచారణాధికారి వద్ద ఉంటాయి. దాంట్లో ఉద్యోగుల పదవీ విరమణ వయసు 60 నుంచి 62కు మార్చి కమిటీ తీర్మానం చేసినట్లు రికార్డు ట్యాపరింగ్ చేసి మరీ ప్రత్యేకంగా ఉత్తర్వులు తెచ్చారు. అనేక సొసైటీల్లో ఇదే తరహా వ్యవహారాలు జరిగాయి. గంగన్నగూడెంలో రూ.25 లక్షలు, జోగన్నపాలెంలో రూ.75 లక్షలు, చింతలపూడిలో రూ.30 లక్షలు, రాఘవాపురంలో రూ.40 లక్షలు, పోతునూరులో రూ.30 లక్షలకుపైగా జరిగిన అవినీతిలో కొద్ది మందిని సస్పెండ్ చేశారు. కీలక విచారణాధికారి మాత్రం విచారణ నిర్వహించి రిపోర్టును మాత్రం ప్రత్యేక వ్యవహారాలతో పెండింగ్‌లో ఉంచారని ఆరోపణలు ఉన్నాయి. సదరు విచారణాధికారికి ప్రత్యేకంగా నలుగురు అసిస్టెంట్ రిజిస్ట్రార్లు, ఒక సీనియర్ ఇన్‌స్పెక్టర్‌తో బృందం ఉంటుంది. సదరు బృందమే సొసైటీల్లోని తప్పులు తెలుసుకుని సొసైటీ కార్యదర్శులను పిలిచి మాట్లాడి రూ.లక్ష నుంచి రూ.5 లక్షలు, తీవ్రతను బట్టి రూ.20 లక్షల వరకు వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. ప్రతి సొసైటీలో ఆడిట్ పూర్తి చేసి బేరం కుదిరితేనే సర్టిఫికెట్ ఇచ్చేలా వ్యవహారం సాగిస్తున్నారు. సొసైటీల్లో జరుగుతున్న అవినీతి వ్యవహారంపై ఇటీవల కొందరు ప్రభుత్వానికి కూడా ఫిర్యాదు చేసి సహకార శాఖకు సంబంధం లేని వ్యక్తితో విచారణ నిర్వహించాలని డిమాండ్ చేశారు.

జగన్ 2.0 లో కార్యకర్తలదే పాలన



కొయ్యలగూడెంలో 'రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో' సదస్సులో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కొయ్యలగూడెం: జగన్‌మోహన్‌రెడ్డి 2.0 పాలనలో కార్యకర్తలే పాలకులు అని, ప్రజలకు అందించే సంక్షేమ పథకాలు కార్యకర్తల ద్వారానే కొనసాగిస్తామని వైఎస్సార్‌సీపీ ఏలూరు పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి కారుమూరి సునీల్ పేర్కొన్నారు. శనివారం కొయ్యలగూడెంలో మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అధ్యక్షతన నిర్వహించిన 'రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో' పార్టీ రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాధరావు, చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజుతో కలిసి పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో ప్రతి అంశాన్ని జగన్ మోహన్ రెడ్డి నిశితంగా పరిశీలిస్తున్నారని, కార్యకర్తలకు జరుగుతున్న అన్యాయాన్ని తప్పనిసరిగా గుర్తుపెట్టుకుని రిటర్న్ గిఫ్ట్ అందిస్తారన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా రాష్ట్రంలో గెలుచుకోబోయే మొట్టమొదటి స్థానం పోలవరం అని చెప్పారు. వైఎస్సార్‌సీపీకి రక్షణ కార్యకర్తలు అని జెట్టి గురునాథరావు పేర్కొన్నారు. సంవత్సరం వ్యవధిలోనే ప్రజా వ్యతిరేకత ఉప్పెనలా మారిందని, పోలవరం నియోజకవర్గంలో జరుగుతున్న అవినీతి తారాస్థాయిలో ఉందన్నారు. చింతలపూడి అసెంబ్లీ నియోజకవర్గాన్ని వైఎస్సార్‌సీపీ కంచుకోటగా మలుస్తూ విజయరాజు పార్టీకి పూర్వ వైభవాన్ని తీసుకురావడానికి కృషి చేస్తున్నారని బాలరాజు పేర్కొన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు మంతెన సోమరాజు, అధికార ప్రతినిధి దాసరి విష్ణు, ఎంపీపీలు సుంకర వెంకటరెడ్డి, గంజిమాల రామారావు, చందా ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ మండలాల అధ్యక్షులు తుమ్మలపల్లి గంగరాజు, కెఎస్ఎస్ శ్రీను రాజు, బుగ్గ మురళి, అల్లూరి రత్నాజీ, తాండ్ర రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

కూటమి మోసాలను నిలదీద్దాం

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు



'రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో' పోస్టర్‌ను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు తదితరులు

కామవరపుకోట: సూపర్ సిక్స్ పథకాలతో రాష్ట్ర ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వ మోసాన్ని నిలదీద్దామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో చింతలపూడి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో 'బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ' అని నాయకులు కూటమి ప్రభుత్వాన్ని విమర్శించారు. ఈ సందర్భంగా డీఎన్నార్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులనే టార్గెట్‌గా చేసుకుని అక్రమ కేసులు పెడుతూ రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ రాష్ట్రంలో అలజడులు సృష్టిస్తున్నారని వీరి మోసాలను గడపగడపకు వెళ్లి ప్రజలకు వివరించాలన్నారు. ఏలూరు పార్లమెంట్ కో–ఆర్డినేటర్ కారుమూరి సునీల్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు సంపద సృష్టిస్తానని చెప్పి చంద్రబాబు నాయుడు తనయుడు లోకేష్‌కు, పవన్ కల్యాణ్‌కు సంపద సృష్టించి పెడుతున్నారన్నారు. అన్నదాత సుఖీభవ పేరుతో రైతులను దగా చేశారన్నారు. కంభం విజయరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో రాష్ట్ర ప్రజలు విసుగు చెంది తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారన్నారు. వారి మోసపూరిత హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాలను వివరించాలన్నారు. జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు సరిత భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలతో మహిళలను మోసం చేసి ఓట్లు వేయించుకున్నారన్నారు. వీరి మోసాలను ప్రతి మహిళ గమనించాలన్నారు. ఏలూరు నియోజకవర్గ కన్వీనర్ జయప్రకాష్, మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, మచిలీపట్నం పార్లమెంట్ పరిశీలకుడు జెట్టి గురునాథరావు, పార్టీ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు జగ్గవరపు జానకి రెడ్డి, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణ, జంగారెడ్డిగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, అంగన్‌వాడీ విభాగం జిల్లా అధ్యక్షురాలు సాయిలు స్వాతి, లింగపాలెం, చింతలపూడి, కామవరపుకోట,జంగారెడ్డిగూడెం మండల అధ్యక్షులు అన్నపనేని శాంతారావు, కొప్పుల నాగేశ్వరరావు, రాయంకుల సత్యనారాయణ, ఓరుగంటి నాగేంద్ర, జంగారెడ్డిగూడెం పట్టణ అధ్యక్షుడు కర్పూరం గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

నష్టాల ఊబిలో మామిడి రైతు

- ఈ ఏడాది పతనమైన మామిడి ధరలు
- కోత ఖర్చులు రాక చెట్లకే కాయలు వదిలేసిన రైతులు
- మామిడి రైతును ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం



ఎగుమతి కోసం సిద్ధంగా ఉన్న మామిడి కాయలు (ఫైల్)

మామిడి ధరలు (టన్ను సగటు ధర)

రకం	గతేడాది	ఈ ఏడాది
బంగినపల్లి	రూ.30 వేలు	రూ.12వేలు
తోతాపురి	రూ.15 వేలు	రూ.4 వేలు

నూజివీడు: లాభాలు పంచుతుందేమోనని ఆశగా ఎదురుచూస్తున్న మామిడి రైతుకు ఏటా నష్టాలు తప్పడం లేదు. ఈ ఏడాది మామిడి కాపు తగ్గిపోయినప్పటికీ మార్కెట్‌లో ధర ఏమాత్రం పెరగకుండా పడిపోవడంతో రైతులకు ఆదాయం లేక నష్టాల ఊబిలోకి కూరుకుపోయారు. పండ్లలో రారాజుగా మామిడికి పేరున్నా ఏటా మామిడి పరిస్థితి దారుణంగా దిగజారుతోంది. ఎకరాకు వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టిన మామిడి రైతులు పెట్టుబడులు కూడా రాక నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. మామిడి సీజన్‌లో మామిడి ధరలు గతంలో ఎప్పుడూ లేనంతగా దారుణంగా పతనమవ్వడంతో రైతులకు కోత కూలి, కిరాయి రాని పరిస్థితుల్లో కొందరు రైతులు చెట్లకే కాయలు వదిలేశారు. దీంతో మామిడిపై రైతులు పెట్టుకున్న ఆశలు అడియాసలయ్యాయి. మామిడి మార్కెట్‌ను కమిషన్ వ్యాపారులు, కాయలను కొనుగోలు చేసే ఢిల్లీ వ్యాపారులు కలిసి తమ గుప్పెట్లో ఉంచుకోవడంతో మామిడికి ధర లేకుండా పోతోంది. దీంతో మామిడి ధర రోజురోజుకు దిగజారుతుందే తప్ప పెరగడం లేదు. పట్టించుకోవాల్సిన ప్రభుత్వం చోద్యం చూస్తూ ఉందే తప్ప గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకోకుండా మిన్నకుండిపోయింది.

జిల్లాలో 45 వేల ఎకరాల్లో మామిడి

ఏలూరు జిల్లాలో 45 వేల ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించాయి. నూజివీడు డివిజన్‌లోనే దాదాపు 40 వేల ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో బంగినపల్లి, తోతాపురి, రసాలను రైతులు ఎక్కువగా సాగుచేస్తున్నారు. కాపు బాగా తక్కువగా ఉన్న నేపథ్యంలో ఈ ఏడాది ధర బాగా లభిస్తుందని రైతులు ఆశించగా ధర లేక వారి ఆశలు అడియాశలయ్యాయి.

ఇతర పంటల సాగు వైపు దృష్టి

నూజివీడు డివిజన్‌లో నేడు మామిడి తోటలంటే అయిష్టత కనబరుస్తున్నారు. మామిడి తోటలలో తెగుళ్ల ఉధృతి పెరగడం, సస్యరక్షణ చర్యలు చేపట్టినా నివారణ అంతంత మాత్రంగానే ఉండటంతో దిగుబడిపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. దీనికి తోడు మామిడి ఎగుమతులు క్షీణిస్తూ ఉండటంతో రైతులు నష్టాలు చవిచూస్తున్నారు. వ్యయ ప్రయాసలకోర్చి కాయలను మార్కెట్‌కు తరలిస్తే అక్కడ సరైన ధర లభించకపోగా రైతులు దోపిడీకి గురవుతున్నారు. ధర ఉన్నా లేకపోయినా మామిడి కాయలను రైతులు ఏదో ఒక రేటుకు అమ్ముకోవాల్సి వస్తోంది. దీంతో మామిడి సాగు తలకు మించిన భారంగా పరిణమించింది. గతంలో రైతులు తమకున్న మామిడితోటల నుంచి వచ్చే ఆదాయాన్ని దృష్టిలో ఉంచుకుని భవిష్యత్ ప్రణాళికలు సిద్ధం చేసుకునేవారు. నేడు ఆ పరిస్థితులు కనుమరగయ్యాయి. మామిడితోటలు తొలగించిన తరువాత సారవంతమైన భూముల్లో స్వల్పకాలిక పంటలను సాగుచేయడం ద్వారా మామిడిలో వచ్చే ఆదాయం కన్నా ఎక్కువ ఆదాయాన్ని గడించవచ్చనే ఆలోచనకు రైతులు వచ్చారు. గత రెండేళ్ల కాలంలో తోటలను నరికివేసిన భూముల్లో మొక్కజొన్న, పత్తి, మిరప, నాటు పొగాకుతో పాటు వేరుశనగ, కూరగాయలు తదితర పంటలను సాగుచేస్తున్నారు. మరికొంద రైతే ఆయిల్‌పామ్ సాగువైపు వెళ్తున్నారు.

పట్టించుకోని ప్రభుత్వం

ప్రధాన వాణిజ్య పంటగా ఉన్న మామిడిని రాష్ట్ర ప్రభుత్వం ఎంతమాత్రం పట్టించుకోవడం లేదు. మంత్రులు, ప్రభుత్వం కల్లబొల్లి కబుర్లు చెప్పడం తప్పితే మామిడి రైతును ఆదుకున్న దాఖలాలు లేవు. మామిడికి గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని రైతులు విమర్శిస్తున్నారు. మార్కెటింగ్ శాఖ అధికారులు కూడా మామిడి మార్కెట్‌లో ధరలు పెరిగేలా ఎంత మాత్రం చర్యలు చేపట్ట లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆదుకోవాలని మామిడి రైతులు కోరుతున్నారు.

ఖర్చులు రావడం లేదు



> మామిడి ధరలు దారుణంగా పడిపోయాయి. కోత కోస్తే ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదు. గతంలో ఎన్నడూ లేని విధంగా ధరలు పడిపోయినప్పటికి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తోంది. పరిస్థితులు ఇలాగే ఉంటే మామిడి సాగు పట్ల రైతుల్లో ఆసక్తి తగ్గిపోతుంది. నూజివీడు ప్రాంతంలో మామిడి పంట కనుమరుగయ్యే పరిస్థితులు ఎదురవుతాయి.
>
> – శీలం రాము, నూజివీడు

బంగినపల్లికి దక్కని ధర

బంగినపల్లి రకం కాయలకు ప్రారంభంలో టన్నుకు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు ధర లభించింది. సీజన్ గడిచిన కొద్దీ ధర తగ్గుముఖం పట్టి సీజన్ ముగిసే సమయానికి టన్ను రూ.8 వేల నుంచి రూ.12 వేలకు పడిపోయింది. దీంతో కోత కూలి, కిరాయి ఖర్చులు కూడా రాని పరిస్థితి. అయినప్పటికీ కాయలను అలాగే ఉంచి చూస్తూ ఊరుకోలేక ఎంతో కొంత డబ్బులు వస్తాయనే ఆశతో కాయలు కోసి మార్కెట్‌కు తరలించారు.

తోతాపురి పరిస్థితి దారుణం

తోతాపురి(కలెక్టర్) రకానికి కూడా ఈ ఏడాది ధర లేదు. గతేడాది సీజన్ ముగిసే వరకు టన్ను ధర రూ.9 వేలకు పైగానే లభించగా ఈ ఏడాది మాత్రం టన్ను ధర రూ.3 వేలకు పడిపోయింది. మామిడి సేఠ్‌ల సిండికేట్, చిత్తూరు జిల్లాలోని జ్యూస్ ఫ్యాక్టరీలు తెరవక కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో తోతాపురి ధరలు పతనమయ్యాయి. టన్ను రూ.3 వేలకు పడిపోవడంతో కోత కూలి, కిరాయి ఖర్చులు కూడా రాని పరిస్థితుల్లో రైతులు తోతాపురి కాయలను చెట్లకే వదిలేశారు.

వీడియో అప్‌లోడ్ ఉత్తర్వులు రద్దు చేయాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మెగా పేరెంట్స్ మీట్‌లో వీడియోలు తీయించి అప్‌లోడ్ చేయాలని సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలని ఏపీటీఎఫ్ 1938 రాష్ట్ర అకడమిక్ కమిటీ కన్వీనర్ గుగ్గిలోతు కృష్ణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామ్మోహన్ రావు, మోహన్ రావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పీటీఎం కార్యక్రమాన్ని డాక్యుమెంట్ కార్యక్రమంగా మార్చడం సరైంది కాదని విద్యాభివృద్ధి గురించి చర్చించే కార్యక్రమంగా దీనిని మార్చాలని డిమాండ్ చేశారు. బోధనకు మాత్రమే ఉపాధ్యాయులను పరిమితం చేస్తామని చెప్పిన పాఠశాల విద్యాశాఖ దానికి భిన్నంగా బోధనేతర కార్యక్రమాలకు వినియోగిస్తున్నారని విమర్శించారు. యోగా పేరుతో వారం రోజులు, పీటీఎం పేరుతో మరో వారం రోజులు బోధనా సమయాన్ని హరిస్తున్నారన్నారు.

మాధ్యమిక విద్యపై సమీక్ష

ఏలూరు(మెట్రో): మాధ్యమిక విద్యపై జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ శనివారం సమీక్ష నిర్వహించారు. స్కూల్ రీ ఓపెనింగ్, నాణ్యమైన మధ్యాహ్న భోజనం, ఉపాధ్యాయుల కొరత, మౌలిక వసతుల మెరుగుదల తదితర అంశాలపై సమీక్షించారు.

10న మెగా పేరెంట్స్ మీట్

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఈ నెల 10న 'మెగా పేరెంట్స్ మీట్' నిర్వహిస్తున్నామని కలెక్టర్ కె. వెట్రిసెల్వి చెప్పారు. కలెక్టరేట్‌లో శనివారం సాయంత్రం పేరెంట్స్ మీట్ నిర్వహణ ఏర్పాట్లను కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 1810 ప్రభుత్వ, 558 ప్రైవేట్ పాఠశాలలు, 140 జూనియర్ కళాశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని చెప్పారు.

క్లుప్తంగా

26 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



మొర్సపూడిలో రేషన్ బియ్యాన్ని పట్టుకున్న అధికారులు

నూజివీడు: మండలంలోని మొర్సపూడిలో అక్రమంగా రవాణా చేస్తున్న రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయిస్ డీటీ జీ వెంకటేశ్వరరావు, వీఆర్వో నాగరాజు గ్రామస్తులతో కలిసి శనివారం పట్టుకున్నారు. రేషన్ షాపులోని బియ్యాన్ని ట్రక్కు వాహనంలోకి లోడు చేస్తుండగా గ్రామస్తులు అధికారులకు సమాచారం అందించడంతో హుటాహుటిన మొర్సపూడికి చేరుకొని ట్రక్కు వాహనంలో ఉన్న 26 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న రేషన్ డీలర్ గొడవర్తి అచ్చయ్య, రేషన్ బియ్యం అక్రమ వ్యాపారి సోలా రాములపై 6ఏ కేసు నమోదు చేశారు.

అనుమతి లేని బస్సులపై అపరాధ రుసుం

తాడేపల్లిగూడెం: అనుమతులు లేకుండా నడుపుతున్న విద్యాసంస్థలకు చెందిన బస్సులకు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు జరిమానా విధించారు. డీటీఓ ఉమామహేశ్వరరావు ఆదేశాల మేరకు స్కూల్ బస్సులను తనిఖీ చేశారు. పిప్పర పరిధిలోని స్కూల్స్ బస్సుల్లో ఒకటి టాక్స్ లేకుండా, మరొకటి ఎఫ్‌సీ లేకుండా తిరుగుతున్నట్టుగా గుర్తించారు. ఈ మేరకు ఆ బస్సుల యజమానుల నుంచి రూ.39 వేల అపరాధ రుసుంను వసూలు చేశారు. గూడెం మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ నాయక్, అసిస్టెంటు ఇన్‌స్పెక్టర్ సుబ్బలక్ష్మి సిబ్బంది పాల్గొన్నారు.

జంతువుల వ్యాధులతో జర జాగ్రత్త..!

- నేడు ప్రపంచ జూనోసిస్ దినోత్సవం
- ఏలూరు జిల్లాకు 25 వేల ఉచిత రేబిస్ వ్యాక్సిన్లు
- బ్రూసెల్లోసిస్ అంటువ్యాధిపై ప్రజలకు అవగాహన
- జిల్లాలో 134 పశు వైద్యశాలల్లో కుక్కలకు ఉచిత టీకాలు

కైకలూరు/కొయ్యలగూడెం : మనుషుల నుంచి జంతువులకు, జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులను జూనోటిక్ వ్యాధులు అంటారు. పిచ్చికుక్క కరిచిన ఓ బాలుడికి 1885లో ఫ్రెంచ్ జీవశాస్త్రవేత్త లూయిస్ పాశ్చర్ రేబిస్ టీకాను ప్రయోగించి, విజయం సాధించిన సందర్భంగా ప్రతి ఏటా జూలై 6న జూనోసిస్ దినోత్సవం జరుపుతారు. జూనోసిస్ డే సందర్భంగా జిల్లాలో పశువైద్యశాలల్లో ఆదివారం కుక్కలకు ఉచిత రేబిస్ టీకాలు వేస్తారు.

జూనోటిక్ వ్యాధులపై అప్రమత్తత

జంతువుల నుంచి సోకే వ్యాధులపై అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్యులు సూచిస్తున్నారు. జంతువుల లాలాజలం, రక్తం, మూత్రం, శ్లేష్మం, మలం, ఇతర శరీర ద్రవాల కారణంగా మనుషులకు జూనోటిక్ వ్యాధులు సోకుతాయి. వీటిలో పాడి పశువుల నుంచి ఆంత్రాక్స్, బ్రూసిల్లోసెస్, లప్టిరియోసిస్, రింగ్ వార్మ్ వ్యాధులు, గొర్రెలు, మేకలు నుంచి హైడాటిడోసిస్, సార్కోసిస్టిస్, ఆంత్రాక్స్, బ్రూసిల్లోసెస్, లప్టిరియోసిస్, సాల్మోనెల్లోసిస్, క్యూ-ఫీవర్, మేంజ్ వ్యాధులు, కుక్కల నుంచి రేబీస్, లీష్మీనియా, బద్దెపురుగుల వ్యాధి, రింగ్ వార్మ్, హైడాటిడోసెస్, మీసిల్స్, మంప్స్, మేంజ్ వ్యాధులు సోకుతున్నాయి. జూనోటిక్ వ్యాధులు ఎక్కువగా కేన్సర్ వ్యాధిగ్రస్తులు, వృద్ధులు, గర్భిణీ రోగులు, 5వ సంవత్సరాల కంటే తక్కువ వయస్సు కలిగిన పిల్లలు, అడవిలో జంతువులతో సహజీవనం చేసే వ్యక్తులకు సోకే అవకాశం ఉంది.

జిల్లాలో 25 వేల ఉచిత రేబీస్ టీకాలు

ఏలూరు జిల్లాలోని 7 నియోజకవర్గాలకు కలిపి మొత్తం 25 వేల ఉచిత రేబీస్ టీకాలు వచ్చాయి. జిల్లాలో ప్రాంతీయ పశువైద్యశాలలు 11, వెటర్నరీ డిస్పెన్సరీలు 66, గ్రామీణ పశు వైద్యశాలలు 57, రైతు సేవాకేంద్రాలు 315 ఉన్నాయి. వీటి పరిధిలో ఆవులు, గేదెలు కలిపి 6,01,589, మేకలు, గొర్రెలు కలిపి 8,06,374, కుక్కలు 15,222 (వీధి కుక్కలు మినహాయించి)గా గుర్తించబడ్డాయి. ఆదివారం ఉదయం నుంచి ఆయా కేంద్రాల్లో పశువైద్యులు ఉచితంగా రేబీస్ టీకాలు అందిస్తారు. అదే విధంగా జూనోటిక్ వ్యాధులపై పెంపుడు జంతువుల యజమానులకు అవగాహన కలిగిస్తారు.

46 వేల బ్రూసెల్లా ఉచిత టీకాలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేషనల్ యానిమల్ డీసీస్ కంట్రోల్ ప్రోగ్రాం(ఎన్ఏడీసీపీ)లో భాగంగా బ్రూసెల్లా వ్యాధిని 2030 నాటికి నిర్మూలించాలనే ధ్యేయంతో మూడేళ్లగా ఉచిత వ్యాధి నిరోధక టీకాలు అందిస్తున్నారు. ఏలూరు జిల్లాలో మూడు విడతల్లో 46 వేల బ్రుసెల్లా వ్యాధి నిరోధక టీకాలు 4-8 నెలల మధ్య వయస్సు కలిగిన ఆడ దూడలకు మాత్రమే ఉచితంగా అందించారు. అది జీవితకాలం వ్యాధి సోకకుండా రక్షణ ఇస్తుంది.



మనుషులకు సోకుతున్న బ్రూసెల్లోసిస్ వ్యాధి

బ్రూసెల్లోసిస్ వ్యాధి జంతువుల నుంచి మనుషులకు సోకే ఒక ముఖ్యమైన జూనోటిక్ వ్యాధి. వ్యాధి సోకిన జంతువులు, కలుషితమైన జంతు ఉత్పత్తులు, ప్రయోగశాలలో బ్రూసెల్లోసిస్ సోకిన జంతువుల ద్రావములను తాకడంతో మానవులకు ఇది వ్యాపిస్తోంది. పశువైద్యులు, పాడి రైతులు, కబేళాల కార్మికులకు ఈ వ్యాధి సోకే ప్రమాదం ఉంది. ఇదే కాకుండా పాశ్చరైజ్ చేయని పాల ఉత్పత్తులు, వ్యాధి సోకిన జంతువుల నుంచి ఉడికించని మాంసం తీసుకోవడం వల్ల కూడా ఇది సోకుతోంది. జ్వరం, కీళ్ల నొప్పులు, అలసట, నీరసం. మగవారిలో వృషణాల వాపు, కుచించుకుపోవడం, వంధ్యత్వానికి గురవుతున్నారు.

టీకాలు తప్పనిసరి



పెంపుడు జంతువులతో మానవులకు అవినాభవ సంబంధం ఉంది. ప్రతి ఒక్కరూ పెంపుడు జంతువులకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలి. జూనోటిక్ వ్యాధులపై అందరూ అవగాహన పెంచుకోవాలి. పశుసంవర్ధకశాఖ ద్వారా ఏటా జూనోసెస్ డే సందర్భంగా ఉచిత రేబీస్ టీకాలు వేస్తున్నాం. అందరూ సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ పఠాన్ ముస్తాఫా ఖాన్, పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు, కైకలూరు

రేబీస్ వ్యాధి సులభంగా వ్యాపిస్తుంది



ఇది కేవలం కుక్క కాటుతోనే కాక, వ్యాధిసోకిన జంతువు లాలాజలం గాయాల మీద పడితే కూడా వ్యాపిస్తుంది. రేబీస్ అనేది ఒక ప్రాణాంతకమైన వ్యాధి. కాబట్టి, కుక్కలు, పిల్లుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవడం, టీకాలు వేయించడం చాలా ముఖ్యమైనది. కాటు సంభవించినప్పుడు వెంటనే వైద్యుని సంప్రదించి రేబీస్ వ్యాధి వ్యాప్తిని నిరోధించడం చాలా అవసరం.

– బీఆర్ శ్రీనివాస్, పశు వైద్యాధికారి, కొయ్యలగూడెం

18 నుంచి బ్యాడ్మింటన్ టోర్నీ

తణుకు అర్బన్: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలు ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో నిర్వహించనున్నట్లు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షురాలు చిట్టూరి సత్య ఉషారాణి, కార్యదర్శి మెంటే వంశీకృష్ణ తెలిపారు. అండర్ 11, 13, 15, 17, 19 బాలురు, బాలికలు, పురుషులు, మహిళలతోపాటు వెటరన్స్ 35, 40, 50, 55, 60, 70 వయస్సు విభాగాల్లో సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ కేటగిరీల్లో పోటీలు నిర్వహిస్తామని, విజేతలు రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిథ్యం వహిస్తారని వివరించారు. పోటీలకు ఎస్‌కేఎస్‌డీ గ్రూప్ ఆఫ్ కాలేజ్ స్పాన్సర్ చేస్తున్నట్లు ఆ సంస్థ గ్రూప్ ఆఫ్ కాలేజ్ సహాయ కార్యదర్శి చిట్టూరి వెంకట కృష్ణారావు తెలిపారు. వివరాలకు టోర్నమెంట్ ఆర్గనైజర్, కార్యదర్శి ఎస్.సతీష్‌బాబు 98496 66223, 97014 04675 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ద్వారకానగర్‌లోని ఇంట్లో చోరీ

ద్వారకాతిరుమల: తాళం వేసిన ఇంట్లో దొంగలు పడి బీరువాలోని 8 కాసులకు పైగా బంగారు వస్తువులను చోరీ చేసిన ఘటన ఎం.నాగులపల్లి పంచాయతీ, ద్వారకానగర్‌లో శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం. గ్రామానికి చెందిన గుండపనేని లక్ష్మీ ఉదయం 10 గంటల సమయంలో ఇంటికి తాళం వేసి కూరగాయల కోసం మార్కెట్‌కు వెళ్లారు. తిరిగి 11 గంటలకు ఇంటికి వచ్చేసరికి ఇంటి తలుపులు పగలగొట్టి ఉండడాన్ని గుర్తించి లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని 8 కాసులకు పైగా బంగారు వస్తువులు కనిపించలేదు. బాధితురాలు లక్ష్మీ వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు.

తొలి ఏకాదశి.. పుణ్యాల రాశి

నేడు శ్రీవారి క్షేత్రంలో ప్రత్యేక పూజలు



ద్వారకాతిరుమల: ఆషాఢ మాసంలో వచ్చే మొదటి ఏకాదశిని తొలి ఏకాదశి అని అంటారు. ఈ ఏకాదశి నుంచే పండుగలన్నీ మొదలవుతాయి కాబట్టి దీన్ని తొలి పండుగ అని పిలుస్తారు. ఈ ఏకాదశిని శయన ఏకాదశి, దేవశయన ఏకాదశి, పద్మ ఏకాదశి అని కూడా అంటారు. ఆదివారం తొలి ఏకాదశి కాగా పండుగ విశిష్టతను శ్రీవారి దేవస్థానం ఆగమ పండితులు సుదర్శనం శ్రీనివాసాచార్యులు మాటల్లో తెలుసుకుందాం.

తొలి ఏకాదశి విశిష్టత

ఈ రోజు నుంచి నాలుగు నెలల పాటు (కార్తీక మాసం శుక్ల ఏకాదశి (ప్రబోధిని ఏకాదశి) వరకు) విష్ణుమూర్తి పాలకడలిపై నిద్రిస్తారు. ఈ నాలుగు నెలల కాలాన్ని చాతుర్మాసం అంటారు. ఏడాదిలో వచ్చే 24 ఏకాదశుల్లోనూ ఈ రోజు మొదటిది. అందుకే ఈ రోజు ఉపవాసం ఉంటే విష్ణుమూర్తి అనుగ్రహం తప్పక లభిస్తుంది. అందుకోసం దశమి రాత్రి నుంచే నిరాహారంగా ఉండాలి. ఏకాదశి రోజు ఉదయాన్నే నిద్రలేచి విష్ణుమూర్తిని తులసీదళాలతో పూజించాలి. రాత్రి అంతా జాగరణ చేస్తూ భాగవతం లేదా విష్ణుసహస్రనామ పారాయణం చేయాలి. మరుసటి రోజు అంటే ద్వాదశి రోజు దగ్గరలోని ఆలయానికి వెళ్లి ఉపవాస దీక్షను విరమించాలి. దీనినే తొలి ఏకాదశి వ్రతం అని అంటారు. ఈ రోజున అన్నం, మాంసాహారం తినకూడదు. తులసి ఆకులు కోయడం, జుట్టు, గోర్లు కత్తిరించుకోవడం, గొడవలు, దుర్భాషలాడటం, పగలు నిద్రపోవడం, ఇతరులను అవమానించడం, చెడుగా ఆలోచించడం, దానం నిరాకరించడం వంటివి చేయరాదు.

శ్రీవారి క్షేత్రంలో..

ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయంలో తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం విశేష కార్యక్రమాలు జరగనున్నాయి. అందులో భాగంగా రాత్రి స్వామివారి గ్రామోత్సవం క్షేత్ర పురవీధుల్లో కన్నుల పండువగా జరుగనుంది. తొలి పండుగ కావడంతో వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శిస్తారని ఆలయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

పోలవరంపై చంద్రబాబు వాస్తవాలు బయట పెట్టాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



సీపీఐ మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

చింతలపూడి : పోలవరం ప్రాజెక్టుపై సీఎం చంద్రబాబు వాస్తవాలు బయటపెట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. చింతలపూడిలో ఏలూరు జిల్లా సీపీఐ ద్వితీయ మహాసభలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ పోలవరం ఎత్తు 41.15 మీటర్లు తగ్గించినట్లు కేంద్ర ప్రభుత్వమే తెలిపిందని, దీనిపై చంద్రబాబు ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. పోలవరం నిర్వాసితులకు న్యాయం జరిగే వరకూ ప్రశ్నిస్తానన్న పవన్ కళ్యాణ్ ఇప్పుడు ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. చంద్రబాబు ఇప్పుడు కొత్తగా పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు అంటూ ప్రజలను ఏమారుస్తున్నారన్నారు.

సూపర్ సిక్స్ ఎక్కడ బాబూ

కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా ప్రజలకు ఒరిగిందేమీ లేదని, సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 20 ఏళ్లపాటు రూ.1.10 లక్షల కోట్ల భారాన్ని విద్యుత్ చార్జీల పెంపు రూపంలో ప్రజలపై ప్రభుత్వం మోపుతుందని ఆరోపించారు. గత ప్రభుత్వంలో స్మార్ట్‌మీటర్లను ఏర్పాటు చేస్తే తప్పు అన్న చంద్రబాబు, లోకేష్ ఇప్పుడు ఎందుకు స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేయాల్సి వస్తుందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అధ్యక్షత వహించగా జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యదర్శి కేవీపీ ప్రసాద్, రాష్ట్ర సమితి సభ్యులు, మండల కార్యదర్శి టి.బాబు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో కాలువలో పడి రౌడీషీటర్ మృతి



వన్‌టౌన్ ప్రాంతంలో కాలువలో పడి ఉన్న సాయి మృతదేహం

ఏలూరు టౌన్: ఏలూరు వన్‌టౌన్ పరిధిలో ఒక రౌడీషీటర్ మద్యం మత్తులో ఒక మురికి కాలువలో పడి ఊపిరాడక మృతిచెందాడు. వివరాల ప్రకారం.. ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలోని వంగాయగూడేనికి చెందిన బలిరెడ్డి విజయసాయి (36) సెంట్రింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. విజయసాయిపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ప్రస్తుతం రౌడీషీట్ కొనసాగుతోంది. మద్యం సేవించిన సాయి శనివారం తెల్లవారుజామున వంగాయగూడెం వైపు నుంచి వస్తూ అక్కడి మురికి కాలువపై ఉన్న గట్టుపై పడుకున్నాడు. పూటుగా మద్యం సేవించి ఉండడంతో ప్రమాదవశాత్తు కాలువలో పడి ఊపిరాడక మృతిచెందాడు. ఈ విషయంపై పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజ్ పరిశీలించి మృతుడు కాలువ గట్టుపై పడుకుని ప్రమాదవశాత్తు జారిపడినట్లు గుర్తించారు. అనంతరం సాయి మృతదేహానికి జీజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. ఏలూరు వన్‌టౌన్ సీఐ జీ.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్సై నాగబాబు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గురుకుల విద్య.. భద్రత మిథ్య

- పోలసానిపల్లి గురుకులంలో శిథిలావస్థకు చేరిన భవనాలు
- విద్యార్థినుల భద్రత దృష్ట్యా వేరే ప్రాంతానికి తరలింపు చర్యలు
- రాష్ట్ర స్థాయి అధికారుల నిర్ణయం కోసం ఎదురు చూపు



కూలిన రెండు ల్యాబ్‌లు (ఫైల్)

భీమడోలు: అధికారుల నిర్లక్ష్యం.. గురుకుల విద్యార్థినుల పాలిట శాపంగా మారింది. శిథిలావస్థకు చేరిన భవనాల్లోనే గురుకుల విద్య తరగతులు నిర్వహించడంపై విద్యార్థుల తల్లిదండ్రుల్లో గుబులు రేపుతోంది. ఏ క్షణాన ఏ భవనం కూలిపోతుందోనని, తమ పిల్లల పరిస్థితి ఏమిటని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పోలసానిపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల భవనంలోని రెండు ల్యాబ్‌లకు చెందిన శ్లాబ్‌లు మే 30వ తేదీన రాత్రి సమయంలో కూలిపోయాయి. అయితే వేసవి సెలవులు కావడం, రాత్రి పూట కూలడంతో పెను ప్రమాదమే తప్పింది. ఈ నేపథ్యంలో విద్యార్థినుల భద్రతపై ప్రశ్నలు తలెత్తిన నేపథ్యంలో సంబంధిత గురుకుల సొసైటీ అధికారులు పరిస్థితిని సమీక్షించారు. పాత భవనాలు క్షేమం కాదని కళాశాలను తాత్కాలికంగా వేరే ప్రదేశానికి మార్చాలని అధికారులు నిర్ణయించినట్లు తెలుస్తోంది. భీమడోలు, ద్వారకా తిరుమల, నల్లజర్ల మండలాల్లో ఎక్కడైనా అద్దె భవనాన్ని తీసుకుని విద్యార్థినులకు తరగతులు నిర్వహించేలా తగు చర్యలు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. అయితే ఇందుకు రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల అనుమతి కోసం ఎదురు చూస్తున్నారు.

బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తూ

పోలసానిపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకు 710 మంది విద్య అభ్యసిస్తున్నారు. టీచర్లు, కార్యాలయ సిబ్బంది, ఇతర సిబ్బందితో కలిసి 100 మందికి పైగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరడం, తరచూ వంటశాల, భోజన శాల, డార్మిటరీల్లో శ్లాబ్‌లు ఊడి కింద పడుతుండడం, అంతేగాకుండా హాస్టల్ ఆవరణలో విష సర్పాలు సంచరించడంతో విద్యార్థినులు, సిబ్బంది బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. దీంతో జూన్ 12వ తేదీ నుంచి తరగతులు పునఃప్రారంభమైనా విద్యార్థినులను ఎక్కువ మంది ఇక్కడ చదివించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు. ఏడు వందల మందికిగాను కేవలం 180 మంది బాలికలు మాత్రమే హాజరవుతున్నారు.

బడ్జెట్ కేటాయింపులేవి?

ప్రతి ఏటా గురుకులాల్లో మౌలిక వసతులు, మరమ్మతులకు బడ్జెట్‌లో గురుకుల సొసైటీ ఉన్నతాధికారులు నిధులు కేటాయించకపోవడమే ఈ పరిస్థితికి కారణమని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ప్రమాదం పొంచి ఉన్నా శిథిలావస్థకు చేరిన భవనాలకు కనీసం మరమ్మతులు నిర్వహించకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పెచ్చులూడుతున్న భోజన శాల



బిక్కుబిక్కుమంటూ భోజనం చేస్తున్న బాలికలు (ఫైల్)



చిట్టడవిని తలపించేలా పోలసానిపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం

పోలసానిపల్లి గురుకుల కళాశాల పరిస్థితిపై రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్లు డీసీవో బి.ఉమాకుమారి తెలిపారు. కళాశాలను వేరే ప్రాంతానికి తరలించే నిర్ణయంపై వారం రోజుల్లో ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వస్తాయని ఆశిస్తున్నట్లు చెప్పారు. అలాగే భవనాల్లోని పటుత్వాన్ని గుర్తించేందుకు ఉన్నతాధికారులతో సంప్రదిస్తుమని, వారిచ్చే నివేదికను సొసైటీ ఉన్నతాధికారులకు సమర్పిస్తామన్నారు. విద్యార్థినుల భద్రతే లక్ష్యంగా తమ వంతు కృషి చేస్తున్నామని, బాలికల తల్లిదండ్రులు ఆందోళన చెందనవసరం లేదని వెల్లడించారు.

ప్రేమ వివాహం.. గ్రామాల మధ్య వివాదం

ప్రేమికుడిపై దాడి చేసిన యువతి బంధువులు



దాడిలో దెబ్బలు తిన్న చటాకాయి గ్రామస్తులు

కైకలూరు: ఓ ప్రేమ వివాహం ఇరు గ్రామాల మధ్య వివాదానికి దారితీసింది. ప్రేమికుడు, అతని బంధువులపై యువతి బంధువులు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన కైకలూరులో శనివారం జరిగింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కైకలూరు మండలం చటాకాయి గ్రామానికి చెందిన ఘంటసాల రోజాకుమార్(22), నత్తగుళ్ళపాడు గ్రామానికి చెందిన నబిగారి లక్ష్మీ ప్రసన్న(22) కైకలూరు కాలేజీలో చదువుతూ ఐదేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. రోజాకుమార్ కుటుంబం కొన్ని నెలలుగా నెల్లూరులో చేపల చెరువులు సాగు చేస్తూ అక్కడే ఉంటున్నారు. ఇంట్లో వివాహం చేయడానికి ప్రయత్నిస్తున్నారని ప్రసన్న చెప్పడంతో రోజాకుమార్ ఆమెను తీసుకువెళ్లి నెల్లూరు సమీప బుచ్చిరెడ్డిపాలెం కామాక్షి దేవాలయంలో తాళి కట్టి దండలు మార్చుకున్నారు. అక్కడ పోలీసు స్టేషన్‌కు వెళ్లారు. విషయం తెలుసుకున్న రోజాకుమార్ గ్రామ పెద్దలు కారులో ప్రేమ జంటను తీసుకువస్తుండగా రాత్రి సమయంలో ఒంగోలు వద్ద యువతికి చెందిన నత్తగుళ్ళపాడు గ్రామస్తులు తారసపడ్డారు. అందరూ కలసి వస్తుండుగా ఏలూరు రూరల్ మండలం శ్రీపర్రు వంతెన వద్ద యువతి మేనమామ ఘంటసాల చందు, బంధువులు మరో నలుగురు బయట వ్యక్తులతో కలిసి యువకుడి కారుపై దాడి చేసి యువతిని తీసుకువెళ్లారు. ఈ దాడిలో రోజాకుమార్‌తోపాటు చటాకాయికి చెందిన ఘంటసాల సుబ్బరాజు, ముంగర గంగాధరరావు, జల్లూరు శ్రీను, ఘంటసాల నారాయణ, డ్రైవర్ సైదు హేమ కిరిటీలకు దెబ్బలు తగిలాయి. వీరు కైకలూరు ప్రభుత్వాసుపత్రిలో చేరగా వీరిని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, వడ్డీ కార్పొరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బలే ఏసురాజు పరామర్శించారు. అనంతరం ఆస్పత్రి వద్ద, పోలీసు స్టేషన్ వద్ద ఇరు గ్రామాల పెద్దలు గొడవకు దిగారు. ఈ విషయంపై కైకలూరు రూరల్ సర్కిల్ సీఐ వి.రవికుమార్ మాట్లాడుతూ బయట వ్యక్తులు దాడి చేసిన ప్రాంతం శ్రీపర్రు కావడంతో అక్కడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తారన్నారు. తల్లిదండ్రులతోనే ఉంటానని యువతి చెప్పడంతో ఇరు గ్రామస్తులతో మాట్లాడామన్నారు. విభేదాలు పడవద్దని గ్రామస్తులకు తెలిపామన్నారు.

మందుల షాపుల్లో తనిఖీలు



కొయ్యలగూడెం మెడికల్ స్టోర్‌లో సోదాలు చేస్తున్న అధికారులు

కొయ్యలగూడెం: మండలంలోని పలు మెడికల్ షాపుల్లో శనివారం ఏలూరు నుంచి వచ్చిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అబిద్ ఆలీ షేక్ నేతృత్వంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. కన్నాపురం రోడ్డులోని మురళీకృష్ణ మెడికల్స్ షాపులో తనిఖీలు నిర్వహించి ఆరు రకాల నిషేధిత ఔషధాలను స్వాధీనం చేసుకొని షాపును సీజ్ చేశారు. అలాగే బుట్టాయగూడెంలోని లక్ష్మీ దుర్గ మెడికల్ స్టోర్స్, కార్తికేయ మెడికల్ స్టోర్స్, కృష్ణ మెడికల్ స్టోర్స్‌లలో కూడా తనిఖీలు జరిపారు. డ్రగ్ ఇన్స్పెక్టర్ అబిద్ ఆలీ షేక్ మాట్లాడుతూ ఓ వ్యక్తి ముసుగు, కళ్లజోడు ధరించి బండిపై తిరుగుతూ ఉభయగోదావరి జిల్లాలతో పాటు ఏలూరు జిల్లాలోని పలు మెడికల్ షాపులకు నిషేధిత ఔషధాలను (వయాగ్రా టాబ్లెట్లు, అబార్షన్ కిట్లు) సరఫరా చేస్తున్నాడని, అతడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.